## నిమోనియా రహిత బాల్యాన్ని ఆశిద్దాం : డిఐఒ

ప్రజాశక్తి-పీలేరు

ఐదేళ్లలోపు పిల్లలకు సంక్రమించే ప్రాణాంతక వ్యాధుల్లో నిమోనియా ఒకటని మనం నిమోనియా రహిత బాల్యాన్ని ఆశించి నివారణకు కృషి చేద్దామని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ ఉషశ్రీ తెలిపారు. బుధవారం పీలేరులో నిర్వహించిన చిన్నపిల్లలు, గర్భిణుల వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రికార్డులు, రిపోర్టులు, టీకాల కేంద్రం నిర్వహణ, సాధించిన లక్ష్యాలు, ఆన్ లైన్ నమోదులను పరిశీలించి, సిబ్బందికి తాజా సూచనలు, సలహాలు అందించారు. నిమోనియా లేని బాల్యం ఎలా సాధ్యమో నిమోనియా వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాల గురించి గర్భిణులకు, పాలిచ్చు తల్లులకు ఆమె వివరించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, పర్యవేక్షకులు కుసుమ, ఎఎన్ఎం విజయ కుమారి, ఆశ కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

గర్భిణులతో మాట్లాడుతున్న డిఐఒ ఉషశ్రీ

# లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యం చూపొద్దు

**- కలెక్టర్ చామకూరి శ్రీధర్**

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్/నందలూరు

వేగం, నాణ్యత, నిష్పక్షపాతం మరియు చట్ట ప్రకారం పిజిఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి మండల స్థాయి అధికారులను ఆదేశించారు. బుధవారం రాజంపేట, నందలూరు ఎంపిడిఒ కార్యాలయాల్లో సిఎంఒ పిజిఆర్‌ఎస్ దరఖాస్తులు, విద్యార్థులకు అపార్ ఐడి జనరేషన్, హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్, ఇండ్ల నిర్మాణ ప్రగతి, ఎన్పిసిఐలో బ్యాంక్ అకౌంట్లకు ఆధార్ లింక్ అంశాలలో తహశీల్దార్లు, ఎంపిడిఒలు, డిటిలు, వీఆర్వోలు, గ్రామ, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఎపిఎంలు, ఇతర మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించి ఆయా అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన విధంగా ప్రజా సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో వేగవంతంగా, నాణ్యతగా, చట్ట ప్రకారం నిష్పక్షపాతంగా పరిష్కరించాలన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి ముఖ్యమంత్రి కార్యాలయం, పిజిఆర్‌ఎస్ ద్వారా అందిన ఫిర్యాదులపై ఇదే రోజు లేదా మరుసటి రోజు క్షేత్రస్థాయిలో అర్జీదారులను కలిసి ఖచ్చితమైన విచారణ చెయ్యాలని సూచించారు. వివిధ సర్వే విఆర్‌ఓ, ఆర్‌ఐ, తహశీల్దార్లు తప్పనిసరిగా మాట్లాడాలని, ఏదైనా అంశంలో నోటీస్ ఇవ్వాల్సి ఉంటే చట్టప్రకారంగా నోటీసు ఇచ్చి గడువు లోపు దాని పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రెవిన్యూ గ్రీవెన్సులు ఒక్కటి కూడా బియాండ్ ఎస్‌ఎల్‌ఎ పరిధి దాటరాదన్నారు. చుక్కల భూములు, ఇనాం భూములు, ఫ్రీ హోల్డ్ రిజిస్ట్రేషన్ పరిశీలన వేగంగా, పారదర్శకంగా పక్కాగా విచారణ చేసి పరిష్కరించాలన్నారు. ఏదైనా తిరస్కరిస్తే అందుకు సంబంధించి సరైన కారణాలు పేర్కొనాలని సూచించారు. ఏదైనా భూముల సర్వే కొరకు దరఖాస్తులు అందితే ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, పోరంబోకు తదితరాలకు ఉచితంగా సర్వే చేయాలని, పట్టా భూములు, ప్రైవేట్ భూములకు సంబంధించి ఎఫ్ లైన్ దరఖాస్తు ఫీజు కట్టించి నిర్ణీత కాల పరిధిలోగా సర్వే పూర్తి చేయాలన్నారు. సిఎంఒ, పిజిఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో నందలూరులో ప్రగతి బాగుందని అభినందించారు. రాజంపేటలో ఎక్కువ శాతం పెండింగ్ ఉందని... కొన్ని దరఖాస్తులు దాదాపు 40 రోజులు పైగా పెండింగ్ ఉండడం పై తహశీల్దార్, వీఆర్వోల పనితీరుపై అసంతృప్తి వ్యక్తపరిచారు. పనితీరు మెరుగుపరచుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఒకే దేశం ఒకే విద్యార్థి నినాదంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అపార్ ఐడి జనరేషన్ ను వందశాతం పూర్తి చేయాలన్నారు. ఇందుకోసం విద్యార్థి ఆధార్ నెంబరు, ఆధార్ నందలి పుట్టిన తేదీ, పాఠశాల రికార్డుల్లో ఉన్న పుట్టిన తేదీ మ్యాచ్ అయితే అపార్ ఐడి జనరేట్ అవుతుందన్నారు. వీఆర్వో మరియు పంచాయతీ సెక్రెటరీ వారి పరిధిలోని ప్రతి కళాశాల, పాఠశాల తప్పనిసరిగా సందర్శించాలని, ఎంతమందికి అపార్ ఐడి జనరేట్ అయింది, ఎంతమందికి కాలేదన్న వివరాలు తెలుసుకొని, ఎవరికైతే జనన ధ్రువీకరణ పత్రం లేక ఇంకనూ అపార్ ఐడి జనరేట్ కాలేదో అలాంటివారికి పంచాయతీ సెక్రెటరీలు రికార్డు మేరకు లేట్ బర్త్ సర్టిఫికెట్ ఇవ్వాలని.., ఒకవేళ రికార్డు లేకపోతే నాన్ అవైలబిలిటీ సర్టిఫికెట్ ఇచ్చి, వాళ్ల చేత లేట్ బర్త్ సర్టిఫికెట్ కొరకు దరఖాస్తు చేయించాలన్నారు. వీఆర్వోలు లేట్ బర్త్ సర్టిఫికెట్ జారీ కొరకు నోటరీని అడగవద్దని కలెక్టర్ స్పష్టంగా పేర్కొన్నారు. ఎవరైనా నోటరీ అడిగినట్లు తమ దృష్టికి వస్తే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒకటి నుంచి 10వ తరగతి వరకు స్కూల్ రికార్డ్, తల్లిదండ్రులు లేదా సంరక్షకుల స్వీయ ధ్రువీకరణ పత్రం తీసుకొని లేట్ బర్త్ సర్టిఫికెట్ కొరకు తహశీల్దార్, ఆర్డీవోలకు పంపాలని సూచించారు. విద్యార్థులకు అపార్ ఐడి నిమిత్తం తల్లిదండ్రులు మీ చుట్టూ తిరగరాదని హెచ్చరించారు. మానవతా దృక్పథంతో పని చేయాలన్నారు. ఇందుకు హెచ్ఎంలు, ఎంఇఒలు పంచాయతీ సెక్రెటరీ, వీఆర్వో, తహశీల్దార్లు, ఎంపిడిఒలతో పూర్తిగా సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. హౌస్‌వర్డ్ జియో ట్యాగింగ్‌లో నందలూరు 77 శాతం, రాజంపేట 64 శాతం ప్రగతిలో ఉన్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. రాజంపేట మండలం జియో ట్యాగింగ్ అంశంలో వెనకబడి ఉండడంపై ఇంజనీరింగ్ అసి స్టెంట్ల వారీగా సమీక్షించి వెనుకబాటుగల కారణాలను అడిగి తెలుసుకుని, తీసు కోవాల్సిన చర్యలపై తగు సూచనలు జారీ చేశారు. బిఎల్, ఎల్ఎల్, ఆర్ఎల్, ఆర్సి వారీగా ప్రగతిని సమీక్షించారు. ప్రతివారం స్టేజి వారీగా ప్రగతి సాధిం చాలన్నారు. గృహ నిర్మాణ ప్రగతిపై రెండు రోజులకు ఒకసారి ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షించాలని ఎంపిడిఒకు సూచించారు. ఇట్లు నిర్మించుకోవడంలో ఎవరికైనా ఆర్థిక సమస్య ఉంటే.. మహిళా సంఘాలలో వారికి రుణాలు ఇప్పిం చాలన్నారు. ఒకవేళ ఇప్పటికే రుణం పొంది ఉంటే అర్హత మేరకు మరల రుణం ఇప్పించేందుకు కృషి చేయాలన్నారు. ఇండ్లన్నింటిని త్వరగా నిర్మించుకునేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని సూచించారు. ఎవరైనా లబ్ధిదారుకు ఇదివరకే ఇండ్లు ఉండి మరలా స్థలం పొంది ఇల్లు కట్టకుండా ఉంటే పంచాయతీ సెక్రటరీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఎపిఎం, వీఆర్వో క్షేత్రస్థాయిలో తగు విచారణ చేసి సరైన ఆధారాలతో నివేదిక సమర్పించిన పిదప సదరు పట్టాను రద్దు చేయాలని తహశీల్దార్‌కు సూచించారు. ఇళ్ల నిర్మాణానికి సిమెంటు, స్టీల్ సమస్య లేదని.. ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించాలని సూచించారు. ఎక్కడైనా ఇసుక రీచులలో మిషన్లు, జెసిబిలు పెడితే వాటిని సీజ్ చేసి అధిక మొత్తంలో పెనాల్టీలు విధించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. పల్లె పండుగలో చేపట్టిన పనులన్నింటినీ వేగవంతంగా 100 శాతం గ్రౌండింగ్ పూర్తి చేసి.. సంక్రాంతి లోగా నాణ్యతగా పనులన్నింటినీ పూర్తి చేయాలని తెలిపారు. ఆయా అంశాలలోని లక్ష్యాలను చిత్తశుద్ధితో బాధ్యతాయుతంగా పూర్తిచేసి ప్రభుత్వానికి, జిల్లాకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని అధికారులతో కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో ఆర్‌డిఒ లీలారాణి, సర్వే ఎడి భరత్ కుమార్, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మండల ఇంజనీరింగ్ అధికారులు, మండల సర్వేయర్లు, ఎంఇఒలు, వీఆర్వో, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

నల్లదిమ్మాయపల్లెలో సర్వే రాయిపై అక్షరాల బొమ్మ చెరపేస్తున్న పనిని పరిశీలిస్తున్న కలెక్టర్

# 104 సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

**- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు**

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాష్ట్ర వ్యాపితంగా వైద్య రంగంలో క్రియాశీలంగా క్షేత్రస్థాయిలో గ్రామీణ ప్రజనీకానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్న 104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు అన్నారు. బుధవారం సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 104 ఉద్యోగులు స్థానిక మసాపేట బ్రిడ్జి వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి సమస్యలు పరిష్కారం చేయాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రామాంజులు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఐదు నెలల అవుతున్నా సమస్యలు గాలికి వదిలేసారని విమర్శించారు. ధరలకనుగుణంగా వేతనాలు పెంచకుండా మొండి వైఖరి ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు. అరబిందో యాజమాన్యం పిఎఫ్ బకాయిలు వారి ఖాతాలలో జమచేయలేదని ప్రభుత్వం చర్యలు తీసుకొని న్యాయం చేయాలన్నారు. ఇక నుండి 104 సర్వీసును ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. 104 వాహనాలకు ఇన్సూరెన్ ఉండదని ఏదయినా ప్రమాదం జరిగితే డ్రైవరకు ప్రమాద బీమా రూ.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వాహన మరమ్మతులు కూడా డ్రైవర్లే అప్పులు చేసి చేయిస్తున్నారని తెలిపారు. వారికి మర మ్మతుల బిల్లులు ఇచ్చి వాహన రిపేరు ఖర్చులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ఆదుకోవాలని తెలిపారు. మూడు సంవత్సరాల నుండి ఇవ్వని ఇంక్రిమెంట్స్‌ను అరియర్స్ రూపంలో బేషరతుగా విడుదల చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్యల పట్ల ప్రభుత్వం స్పందిచకపోతే ఈ నెల చివరి నుండి సమ్మె కు వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం 104 ఉద్యోగ నాయకులు నాగిరెడ్డి, వినయ్, 104 ఉద్యోగులు, మాధవ బాలకృష్ణ, రాజు, నాగార్జున, నగేష్, సిఐటియు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

# ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేసుకుందాం

**- ఎల్ఐసి ఉద్యోగుల సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి**

కళాజాత కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పెన్షనర్ల సంఘం నేతలు

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేసుకుందామని, ఎల్ఐసి యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 14న సాయంత్రం 5.30 నుంచి 8 గంటల వరకు కడప రాజీవ్ పార్క్ దగ్గర జరిగే కళాజాతా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎల్ఐసి ఉద్యోగుల సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం అధ్యక్షులు నాగమునిరెడ్డి, ఎల్ఐసి పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.సుధీకర్ అన్నారు. బుధవారం పాత కలెక్టరేట్ ఎదుట ఉన్న ప్రభుత్వ పెన్షనర్ల సంఘ కార్యాలయ సమావేశంలో సంఘం ఉపాధ్యక్షులు నారాయణ ఆధ్వర్యంలో పెన్షనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్ఐసి పొదుపుపై జీఎస్టీ తొలగించాలని, ఎఫ్‌డిఐ పరిమితి పెంచే ఆలోచన విరమించాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక ఆర్టీసీ ఆవరణలో ఆర్టీసీ పెన్షనర్ల సమావేశంలో రఘునాథరెడ్డి, రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ సిబ్బందికి విలీనం వల్ల హామీ ఇచ్చిన ప్రయోజనాలు ఇంకా నెరవేరాల్సి ఉందన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేసి ఉపాధ్యాయులను కళాజాతా కార్యక్రమానికి సమీకరిస్తున్నామని జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్ అన్నారు. విద్య, ఆరోగ్య రంగాలు, ప్రభుత్వ రంగంలో ఉండాలన్నది కళాజాత ప్రచార లక్ష్యాల్లో ఒకటని అన్నారు. ఎల్ఐసి యూనియన్ కార్యాలయావరణలో మహిళా సంఘాల మరో సమావేశంలో జెవివి, ఐద్వా, శ్రామిక మహిళ, అంగన్వాడీ సంఘాల నేతలు కళాజాత పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘాల నేతలు వసుప్రద, పర్వీన్, సుబ్బమ్మ, సునీత, లక్ష్మీదేవి మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలు బలోపేతమైతేనే మహిళలకు ఉద్యోగ భద్రత, సమాన హక్కులు, శ్రమదోపిడి ఉండవన్నారు. సమావేశాలలో నాయకులు నారా యణ, మల్లయ్య, సుభాన్, సుబ్బరాయుడు, నాగయ్య, పుల్లయ్య, రమణ శీను పాల్గొన్నారు.

## విద్య ద్వారానే చట్టాలపై అవగాహన : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్య ద్వారానే చట్టాలపై అవగాహన లభిస్తుందని మదనపల్లె డిఎస్‌పి కొండయ్య నాయుడు, బిటి కాలేజ్ ప్రిన్సిపల్ కృష్ణవేణిలు తెలిపారు. బుధవారం స్థానిక బిటి కళాశాల మైదానంలో తిరుపతి సిఐడి కార్యాలయం వారి ఆధ్వర్యంలో దళిత వర్గాల సాధికారిక, వారిపై జరుగుతున్న అఘాయిత్యాల నివారణకై చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సమాజంలో ఎస్‌సి, ఎస్‌టిల హక్కుల సాధన కేవలం విద్య అభ్యసించడం ద్వారానే సాధ్యమవుతుందని అన్నారు. భారత రాజ్యాంగం ఎస్‌సి,ఎస్‌టి చట్టాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ ఎస్‌సి, ఎస్‌టి కేసులపై ప్రభుత్వానికి నివేదించిన మార్గదర్శకాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకొని మంచి స్థానాల్లో కొలువుతీరి ఎస్‌సి, ఎస్‌టిల అభ్యున్నతికి కృషి చేయాలని మాల మహానాడు నాయకులు పిలుపునిచ్చారు. ఎస్‌సి, ఎస్‌టిల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ అధికారులు సత్వరమే స్పందించాలని వారు కోరారు. ఎస్‌సి కార్పొరేషన్ అధికారి జయప్రకాష్, ఎస్‌సి, ఎస్‌టి సెల్ సిఐ ప్రభాకర్‌రెడ్డి, ఎపిపి వీరాంజనేయులు, తహశీల్దార్ ఖాజాబీ, డిటి కుమారి, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు యమలా సుదర్శన్, బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు, కౌన్సిలర్ ప్రసాద్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి-రాయచోటి

సుండుపల్లె మండలం దిగువవాండ్లపల్లెలోని జడ్‌పి ఉన్నత పాఠశాలలో విద్యార్థి విగ్నేష్‌ను గాయ పరిచిన ఆ పాఠశాల ఉపాధ్యాయుడు లోకేష్‌ను సస్పెండ్ చేయాలని కోరుతూ బుధవారం డిఇఒ సుబ్ర హ్మణ్యంకు కలిసి విద్యార్థి యువజన సంఘాలు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘ నాయ కులు అంకన్న, సుబ్బరాయుడు, జయవర్ధన్, రాజేంద్రప్రసాద్ లు మాట్లాడుతూ సుండుపల్లె మండలం దిగువవాండ్లపల్లి జడ్‌పి ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి విగ్నేష్‌ను ఇష్టానుసారంగా ఆ పాఠశాల చెందిన ఉపాధ్యాయుడు లోకేష్ విపరీతంగా కొట్టడం విద్యహక్కు చట్టానికి వ్యతిరేకమని ఇంత జరిగినా డిఇఒ వెళ్లి విద్యార్థి వారి కుటుంబ సభ్యులను పరామర్శించలేదని వారు విమర్శించారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చర్య తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

## 'వెలుగు'లో విభిన్న ప్రతిభావంతురాలికి వివాహం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రత్యేక పాఠశాలలో ఆశ్రయం పొందుతున్న విభిన్న ప్రతిభావంతురాలికి సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డి తండ్రి స్థానంలో ఉండి వివాహం జరిపించారు. వివరాల్లోకి వెళితే.. జువైనల్ జస్టిస్ యాక్ట్, తిరుపతి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ వారి ద్వారా గవర్నమెంట్ స్పెషల్ కమ్ చిల్డ్రన్ హోమ్, అబ్సర్వేషన్ హోమ్ ఫర్ గర్ల్స్ అప్పటి సూపరిం టెండెంట్ బి.నందగోపాల్ వారి ఆదేశాల మేరకు చిల్డ్రన్ హోమ్ సిబ్బంది 2018, సెప్టెంబర్‌లో 15 ఏళ్ల వయస్సు ఉన్న విభిన్న ప్రతిభవంతురాలు మరియమ్మాళ్‌ను స్థానిక అమ్మచెరువుమిట్టలో వెలుగు సంస్థలో చేర్చారు. వెలుగు సంస్థ లో పెరిగిన మరియమ్మాళ్ స్పీచ్ థెరపీ ద్వారా కొంచెం మాట్లాడటం నేర్చుకుంది. మూడేళ్ల కాలంలో ఒకేషనల్ ట్రైనింగ్ ద్వారా అగరబత్తి , టైలరింగ్, హ్యాండ్ వర్క్, వైర్ బ్యాగ్స్ అల్లడం మొదలగు వాటిల్లో నైపుణ్యాన్ని సంపాదించుకుంది. వంట పనులు చేయడం నేర్చుకొంది. సంస్థలో విభిన్నప్రతిభావంతులు, వృద్ధులకు తనవంతు సేవలను అందించేది. పెళ్లీడు వచ్చిన మరియమ్మాళ్‌కు ఎవరూ లేకపోవడంతో సెక్రటరీ ఉదయ్ మోహన్‌రెడ్డి తండ్రి స్థానం లో ఉండి, వేంపల్లి గ్రామం, బండకాడపల్లికి చెందిన గుడ్డూరు వెంకటరమణ, రాణెమ్మ దంపతుల కుమారుడు లక్ష్మి ప్రసాద్‌తో వివాహం నిశ్చయించారు. మరియమ్మాళ్ పేరును లక్ష్మి ప్రసన్నగా మార్చి.. యువతీ, యువకుల ఇష్టం మేరకు పెద్దల నిర్ణయం ప్రకారం బుధవారం రాత్రి అమ్మచెరువుమిట్టలోని అరివేణి కళాక్షేత్రంలో రిసెప్షన్ చేశారు. గురువారం ఉదయం 3 గంటలకు మూహుర్తం నిర్ణయించారు. వెలుగు సంస్థలో ఆశ్రయం పొందిన యువతికి వెలుగు సంస్థ యాజమాన్యమే వివాహం చేస్తుండడంతో అక్కడ పెళ్లి సందడి నెలకొంది.

## ఎఎస్‌పిగా వెంకటాద్రి

ప్రజాశక్తి-రాయచోటి

ఎఎస్‌పిగా వెంకటాద్రిని నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు అదనపు ఎస్పీలను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. జిల్లాలో స్టాండ్ బైలో ఉన్న అడిషనల్ ఎస్పీ రాజశేఖర్ రాజును చిత్తూరు అడిషనల్ ఎస్పీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో వెంకటాద్రిని నియమించారు. రెండు రోజులలో బాధ్యతలు చేపట్టినున్నారు.

# సంక్షేమ హాస్టళ్లకు మరమ్మతులు చేపట్టాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

శిథిలావస్థలో ఉన్న సంక్షేమ హాస్టళ్లకు మరమ్మతులు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ కలెక్టర్‌ను కోరారు. సంక్షేమ హాస్టల్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం కలెక్టర్ శ్రీధర్ చామకూరికి స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న సంక్షేమ హాస్టలకు మరమ్మతులు చేయించి విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంక్షేమ హాస్టల్లలో పాత భవనాలు ఉండడం ద్వారా చిన్నపాటి వర్షానికి సైతం గదులలోకి నీరు చేరి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు అనేకమంది పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు సంక్షేమ హాస్టళ్లను నమ్ముకుని ఉన్నత చదువు అభ్యసించడానికి వస్తున్నారని అన్నారు. అలాంటి వారికి మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని అన్నారు. రైల్వే కోడూరు ప్రాంతంలో ఎర్రచందనం పార్కు దగ్గర ఉన్న ఎస్‌సి హాస్టల్ పూర్తిగా శిథిలావస్థకు చేరడం వలన విద్యార్థులు భయంతో హాస్టల్ గదిలో తల దాచుకుంటూ చదువును అభ్యసిస్తున్నారన్నారు. రైల్వే ట్రాక్ పక్కన ఉన్న భవనాలు కూడా పూర్తిస్థాయిలో మౌలిక వసుతులు లేక విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గిరిజన ఆశ్రమ పాఠశాల యువత శిక్షణ కేంద్రానికి సంబంధించిన స్థలాన్ని సర్వే నెంబర్ 1205లో 30సెంట్లు స్థలాన్ని కొంతమంది వ్యక్తులు ఆక్రమించుకోవడం జరిగిందని, వెంటనే గిరిజన ఆశ్రమ పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని కబ్జాదారుల నుంచి రక్షించాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. కలెక్టర్ స్పందించి ఆక్రమిత భూమిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌ను ఆదేశించారని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాజంపేట నాయకులు సూర్య వర్ధన్, వినోద్ కుమార్, శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

# అసిస్టెంట్ మేనేజర్ పక్షపాత వైఖరి విడనాడాలి : ఇయు

నిరసన తెలుపుతున్న ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ పాత వాసనలు విడనాడకుండా కేవలం వైఎస్ఆర్ ఎంప్లాయిస్ యూనియన్‌కు మాత్రమే వత్తాసు పలుకుతూ మిగిలిన యూనియన్ల పట్ల పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్న ఆర్‌టిసి డిపో అసిస్టెంట్ మేనేజర్ మాధవి లతపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.సి శేఖర్ డిమాండ్ చేశారు. అసిస్టెంట్ మేనేజర్ వైఖరిని ఖండిస్తూ బుధవారం డిపో గేట్ వద్ద ఆర్‌టిసి కార్మికులతో కలిసి ఆయన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ డిపోలో డ్రైవర్లు, కండక్టర్ల నూతన డ్యూటీ చార్ట్‌లో అవకతవకలకు పాల్పడుతున్నారని అన్నారు. అన్ని అసోసియేషన్‌ల ఉద్యోగులను సన్మానంగా చూడాల్సిన అసిస్టెంట్ మేనేజర్ వైసిపి అనుబంధ సంఘమైన వైఎస్ఆర్ ఎంప్లాయిస్ యూనియన్, ఎన్ఎంయుఎ సంఘాలకు నాయకురాలిగా వ్యవహరిస్తూ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగులు, కార్మికుల పట్ల వేధింపులకు పాల్ప డుతున్నారని ఆరోపించారు. తనకు కావలసినవారికి ఒడి డ్యూటీలు ఇస్తూ రోజువారీ సెలవులు ఇస్తున్నారని, ఎంప్లాయిస్ యూనియన్ కార్మికులకు సెలవు కావలసి వస్తే డబ్బులు చెల్లించి సెలవు తీసుకోవాల్సి వస్తోందని ఆవేదన చెందారు. సాక్షాత్తు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి సొంత జిల్లాలో పాత వాసనలతో వైసిపి అంటకాగుతూ పక్షపాత వైఖరి ప్రదర్శిస్తూ వైఎస్ఆర్ యూని యన్‌కు రెడ్ కార్పెట్ వేసి పెంచి పోషిస్తున్న ఇలాంటి అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి సంస్థ అభివృద్ధికి దోహదపడాలని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్, డిపో కార్యదర్శి మౌలా, సలహాదారులు చలపతి, గ్యారేజ్ కార్యదర్శి వెంకటసుబ్బయ్య, రాజు, రామచంద్ర, ఈశ్వరయ్య, సుధా, మోహన్, భద్రయ్య పాల్గొన్నారు.

## నిర్బంధ వివాహాలను నమోదు చేయాలి

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ :** గ్రామ, రాష్ట్ర వ్యాప్తంగా నిర్బంధ వివాహల నమోదు అమలు చేయాలని పోర్డ్ సంస్థ డైరెక్టర్ లలితమ్మ డిమాండ్ చేశారు. బుధ వారం పోర్డ్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ నేటి నుంచి ఈ నెల 20 వరకు వివాహాలు నమోదు కోసం పోస్ట్ కార్డు ఉద్యమం తలపెట్టినట్లు ప్రకటించారు. విద్య, వైద్యంలో పిల్లలకు బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలన్నారు. నేటి సమా జంలో బాల కార్మికులు అధికం కావడంతోపాటు బాల్య వివాహలు అవరోధంగా మారయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాలపై పిల్లలకు అవగాహన కల్పించడంలో భాగంగా అవగా హన ర్యాలీలు, చిత్రలేఖనం పోటీలు నిర్వ హించడం జరుగుతుందన్నారు. జూనియర్ బాలికల కళాశాలలు, హైస్కూల్ విద్యార్థినలు రాసిన పోస్ట్ కార్డులను డిప్యూటీ సిఎంకు పంపనున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థికి విద్య, వైద్యం అందుబాటులోకి వచ్చేలా స్థానిక పిహెచ్‌సిలో గైనకాలజీ, హాస్టల్స్‌లో మౌలిక వసతులు మెరుగు పరచాలన్నారు. ప్రతి నియోజకవర్గంలోని మండలాల్లో బాలికలు విద్యను కొనసాగించేలా జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని కోరారు.బాలికలపై జరుగుతున్న దాడులను అధిగమించ డానికిగాను ప్రతి గ్రామంలో గ్రామ బాలల పరిరక్షణ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నారు. తంబళ్లపల్లి నియోజకవర్గంలో డిగ్రీ, వృత్తి విద్యా కోర్సులతో డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ అంశాలన్నింటిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి డిప్యూటీ సిఎం పవన్ కల్యాన్‌కు వినతిపత్రం అందిస్తామని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న లలితమ్మ

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

## రుణాలు రీ షెడ్యూల్ చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలోని కరువు మండలాల వ్యవసాయ రుణాలను త్వరగా రీ షెడ్యూల్ చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశించారు. బుధవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్లోనే విసి హాల్లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కన్సల్టేటివ్ కమిటీ సమావేశాన్ని జిల్లా ఎల్డిఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఎల్‌డిఎం ఆంజనేయులు, జిల్లాలో ప్రభుత్వం నిర్ణయించిన కరువు మండలాలకు సంబంధించిన వివిధ మార్గదర్శకాలను కలెక్టర్‌కు కమిటీ సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కరువు మండలాలుగా 54 మండలాలను ప్రభుత్వం గుర్తించిందని అందులో 19 మండలాలు అన్నమయ్య జిల్లాలో ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలోని కరువు మండలాలకు సంబంధించిన వ్యవసాయ లోన్లను త్వరగా రీ షెడ్యూల్ చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చేయాలన్నారు. రైతులకు కొత్త వ్యవసాయ లోన్లు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో వివిధ బ్యాంకులకు చెందిన అకౌంట్లు ఆధార్కు అనుసంధానం కాలేదని, గ్రామానికి ఒక బ్యాంకు కరస్పాండెంట్ను ఏర్పాటు చేసి త్వరితగతిన అనుసంధానం చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎల్‌డిఎం ఆంజనేయులు, వివిధ బ్యాంకులకు చెందిన అధికారులు, డిసిసి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ అవినాష్‌రెడ్డి పిఎ రాఘవరెడ్డి కోసం కొనసాగుతున్న గాలింపు

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి బండి రాఘవరెడ్డి కోసం పోలీసులు గాలింపు కొనసా గుతోంది. సామాజిక మాధ్యమాలలో అసభ్యకర పోస్టులు వర్రా రవీందర్‌రెడ్డి ఇచ్చిన వాంగ్మూలం మేరకు రాఘవరెడ్డి కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. బుధవారం తెల్లవారుజామున నుంచి రాఘవరెడ్డి కోసం పులివెందుల, లింగాల మండలాలలో గాలిస్తున్నారు. అతని స్వగ్రామమైన అంబకపల్లెలో పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. ఈ కేసులో ఆరోపణలు ఉన్న వ్యక్తుల కోసం కూడా పోలీసులు గాలిస్తున్నట్లు సమాచారం. పులివెందుల డిఎస్‌పి మురళి నాయక్ ఆధ్వర్యంలో సబ్ డివిజన్ పరిధిలోని సిఐలు, ఎస్ఐలు, పోలీసులతో కలిసి జల్లెడ పడుతున్నారు.

## పెద్దదర్గాను సందర్శించిన గాయకుడు మనో

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప అమీన్‌పీర్ దర్గాను ప్రముఖ గాయకుడు మనో, అయన భార్య జమిలా సందర్శించారు. బుధవారం దర్గా సాంప్రదాయ ప్రకారం నిర్వాహకులు వారికి స్వాగతం పలికారు. మనో పూల చాదర్ సమర్పించారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. దర్గాను దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.

పూల చాదర్ సమర్పిస్తున్న గాయకుడు మనో

గ్రంథాలయ వారోత్సవాల గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న ఎంఇఒలు

## గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయండి

**ప్రజాశక్తి-కలికిరి**

57వ గ్రంథాలయ వారోత్సవాల్లో విద్యార్థులు ఉపాధ్యాయులు ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని శాఖా గ్రంథాలయ అధికారి విజయకుమార్ తెలిపారు. స్థానిక శాఖ గ్రంథాలయం కలికిరి నందు 57వ గ్రంథాలయ వారోత్స వాలు గురువారం నుంచి 20వ తేదీ వరకు జరుగుతాయని ఆయన అన్నారు. 15న పుస్తక ప్రదర్శన, 16న కవి సమ్మేళనం, 17న గ్రంథాలయ ఉద్యమకారులను స్మరించడం, 18న స్త్రీ సాధికారత మీద చర్చ , మాదకద్రవ్యాల మీద అవగాహన కార్యక్రమం, 19న విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహిం చడం, 20వ తేదీ న బహుమతి ప్రధానోత్సవం, ముగింపు వేడుకలు నిర్వహిస్తారని చెప్పారు. 57వ గ్రంథాలయ వారోత్సవాల గోడపత్రికలను కలికిరి ఎంఇఒలు కరీముల్లా, నాగార్జున ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు, పాఠకులు, విద్యార్థులు గ్రంథాలయాలకు వచ్చి గ్రంథాలయ వారోత్సవా లను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ గ్రంథాలయాలను విద్యార్థులు సరిగ్గా సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు. రాబోవు డిఎస్‌సి-2024కి సన్నద్ధమవుతున్న అభ్యర్థులు గ్రంథాలయానికి వచ్చి ఉద్యోగం సాధించేలా కష్ట పడి చదవాలని కోరారు. డిఎస్‌సికి అవసరమైన అకాడమిక్ పుస్తకాలను గ్రంథాలయంలో అందుబాటులో ఉంటాయని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అందరూ జ్ఞానాన్ని పెంచుకో వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిఆర్పి భాస్కర పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** స్థానిక తంబళ్లపల్లి గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ కార్యదర్శి ఆదేశాల మేరకు 20వ తేదీ వరకు జరిగే గ్రంథాలయ వారోత్సవాల్లో వారోత్సవాలలో పుస్తక ప్రదర్శన, వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ, ముగ్గుల పోటీలు నిర్వహించి విద్యార్థులకు ముగింపు రోజున బహుమతులు అందిస్తారని గ్రంథాలయాధికారి ఎస్. జిలానిబాషా తెలిపారు. **కలకడ:** గ్రంథా లయ వారోత్సవాలను గురువారం నుండి ప్రారంభిస్తున్నట్లు కలకడ శాఖ గ్రంథాలయ అధికారి అమరనాథ తెలిపారు. మండల కేంద్రమైన కలకడలోని గ్రంథాలయంలో ఒక్కొక్క రోజు ఒక కార్యక్రమం నిర్వహిస్తూ గ్రంథాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని చెప్పారు..ఈ వారోత్సవాలలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## పంచాయతీలో రెండు టెండర్లు ఖరారు

**ప్రజాశక్తి-పీలేరు**

మాట్లాడుతున్న గురుమోహన్

పీలేరు గ్రామపంచాయతీలో ప్రజా ప్రయోజనాల వస్తువుల సరఫరా కోసం రెండు టెండర్లను ఖరారు చేసినట్లు మేజర్ గ్రామ పంచాయతీ గ్రేడ్ వన్ కార్యదర్శి గురు మోహన్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేక రులతో మాట్లాడుతూ 4నెలల 20రోజులకు వస్తువుల సరఫరా నిమిత్తం సోమవారం పంచాయతీ కార్యాల యంలో టెండర్లు నిర్వహించామని అన్నారు. ఇందులో రక్షిత నీటి సరఫరా పరికరములు, ప్రజారోగ్య పరికర ములు, రక్షిత నీటి సరఫరా మోటారు పంపుసెట్లు మరమ్మతులకు సంబంధించి టెండర్లను నిర్వహించినట్లు తెలిపారు. ప్రజారోగ్య పరికరముల సరఫరాకు రెండు దరఖాస్తులు అందగా అందులో నిబంధనల మేరకు తక్కువ కొటేషన్ చేసిన మదనపల్లి స్వాతి ఎలక్ట్రికల్స్ అండ్ హార్డ్‌వేర్‌కు, మంచినీటి సరఫరా పరికరాల కోసం తక్కువ ధరతో టెండర్ వేసిన శ్రీశ్రీనివాస ఎంటర్‌ప్రైజెస్ వారికి టెండర్లను ఖరారు చేసినట్లు కార్యదర్శి తెలిపారు. రక్షితనీటి సరఫరా మోటారు పంపుసెట్ల మరమ్మతులకు సంబంధించిన టెండర్ కోసం ఎవరూ దరఖాస్తు చేసు కోలేదని అన్నారు. కార్యక్రమంలో పీలేరు మండల విస్తరణాధికారి లతీఫ్‌ఖాన్, శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ నౌషాద్, టెండరు దారులు పాల్గొన్నారు.

## కనకదుర్గమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే 'పెద్దిరెడ్డి'

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి బుధవారం తన అనుచరులతో విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ముందుగా వేద పండితుల ఆశీర్వాదాలు తీసుకున్నారు. అనంతరం అమ్మవారి దర్శనార్థం కోసం బయలుదేరి సాధారణ క్యూలైన్‌లో వెళ్లి శ్రీకనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించు కున్నారు.ఆలయ అర్చకులు, వేదపండితులు ఎమ్మెల్యేకి ఆశీర్వచనాలు, తీర్థప్రసా దాలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. మంచి చేస్తామని రాష్ట్ర ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ఇచ్చిన హామీల ను అమలు చేసిన ఏకైక నాయకుడు మాజీ సిఎం వై.ఎస్.జగన్ అని కొనియాడారు.

## నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

**ప్రజాశక్తి-ములకలచెరువు :** మండల కేంద్రం ములకలచెరువులో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తంబళ్లపల్లి జనసేన ఇన్‌ఛార్జి పోతుల సాయినాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ములకలచెరువు హీరో షోరూం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో ఆరోగ్యశ్రీ కార్డు కలిగివున్న అవసరమైన వారికి ఉచిత కంటి పరీక్షలు, ఉచిత ఆపరేషన్‌లు నిర్వహిస్తారని తెలిపారు. డయాబెటిస్ రేటిన సమస్యలు ఉన్నవారికి కూడా ఉచిత వైద్యం అంది స్తున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసు కోవాలని కోరారు.

## సభ్యత్వ నమోదుకు మంచి స్పందన

**ప్రజాశకి-మదనపల్లె అర్బన్ :** టిడిపి సభ్యత్వ నమోదుకు అనూహ్య స్పందన లభిస్తోందని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆదేశాల మేరకు.. మండలం లోని సిటిఎం క్రాస్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం పెద్దఎత్తున చేపట్టారు. ఇందులో భాగంగా పలువురి చేత సభ్యత్వాన్ని నమోదు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి నాయకులు, కార్యకర్తల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ అధిక ప్రాధాన్యతని స్తున్నారని అన్నారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి రూ.5 లక్షల బీమా వర్తించడంతో పాటు, వారి కుటుంబానికి అన్నివిధాలా మేలు జరుగుతతుందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, యూనిట్ ఇన్‌ఛార్జి చల్లా నరసింహులు, రెడ్డి రాంప్రసాద్, చల్లా శ్రీనివాసులు, శంకర్ రెడ్డి, రాజంపేట పార్లమెంట్ ఐటిడిపి ఉపాధ్యక్షులు వేల్పుల వెంకటేష్ పాల్గొన్నారు.

## బిసి సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం

**ప్రజాశక్తి-ములకలచెరువు**

రాష్ట్రంలో బిసి సంక్షేమానికి, అభ్యున్నతికి అగ్రస్థానంలో నిలిపిన ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు అని టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి, గుత్తికొండ త్యాగరాజు అన్నారు. బుధవారం ఏర్పా టు చేసిన సమా వేశంలో ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి వార్షిక బడ్జెట్ ను కూటమి ప్రభుత్వం అసెంబ్లీ సమా వేశాల్లో ఐదు ప్రధాన రం గాలకు ప్రాధాన్యత ఇచ్చి ందన్నారు. బిసిలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ రూ. 39,007 కోట్లతో బిసిల సంక్షేమానికి అగ్రస్థానం ఇచ్చారని అన్నారు. బిసిలకే టిడిపికి వెన్నుముక అని చెప్పి అధిక ప్రధాన్యత కల్పిం చారని అన్నారు.బిసిలంతా టిడిపి వెంటే ఉన్నారన్నారు.

**LOSS OF DOCUMENT**

I Syed Noorjahan W/o Late Syed Ansar Basha, # 27-137-57-1-1,YetigaddaPalyam, School Street, Punganur, Chittoor District. AP-517247, Here with declare that I have lost original sale deed documents bearing no" 229/2003 at my house shifting, If any one found please contact above address. today on wards I used to certificates copies sale deed documents for my property transaction any one found and used that above original documents become illegal and void transaction and my self taking loan from "VERITAS FINANCE" Madanapalle Branch by pledging my Certified copy of sale deed Doc. No: 229/2003.

# కురుస్తున్న వర్షాలు..ఉరుస్తున్న ఆర్‌టిసి గదులు

- పెచ్చులూడుతున్న పైకప్పు
- భయాందోళన చెందుతున్న వ్యాపారులు

ఆర్‌టిసి బస్టాండ్

పెచ్చులూడిన పైకప్పు

**ప్రజాశక్తి-పీలేరు**

తుఫాను కారణంగా కురుస్తున్న వర్షాలకు పీలేరు ఆర్‌టిసి బస్టాండ్‌లోని గదులు ఉరుస్తూ నిర్వాహకులను ఇబ్బంది లతో పాటు భయాందోళనకు గురిచేస్తున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తడిసిన ఆర్‌టిసి బస్టాండ్ భవనం పైకప్పు నుంచి సీలింగ్ పెచ్చులూడి కింద పడుతూ వ్యాపార సముదాయ నిర్వాహకుల పాలిట ప్రమాదంగా మారింది. బస్టాండ్ ప్రాంతంలోనూ ఇదే పరిస్థితులు ఉండగా ప్రయాణికుల సంరక్షణ కోసం ఇటీవల రూ.8.50 లక్షలు ఖర్చు చేసి సీలింగ్, బస్టాండ్ భవనం పై భాగంలో కొంత దూరం మరమ్మతులు చేయించారు. అదే సమయంలోనే వ్యాపార సముదాయాల నిర్వాహకులు కూడా తమ గదులు వర్షానికి ఉరుస్తూ, సీలింగ్ నుంచి పెచ్చులూడుతున్నాయని సంబంధిత అధికారులకు సమాచారం అందించి తమ ఇబ్బందులను వారి దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయిం దని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలకు వేలు తమ నుంచి అద్దెలు వసూలు చేయడంలో చూపుతున్న శ్రద్ధ తమ ఆధీనంలోని దుకాణాల పైకప్పుల మరమ్మతుల చేయించడంలో అశ్రద్ధ ఎందుకని వారు ప్రశ్నిస్తున్నారు. దిన దిన గండంగా బతుకుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన సహాయక చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

### మాగోడుపట్టించుకోరా?

ఎన్నో ఏళ్లుగా తాము నడుపుతున్న వ్యాపార సముదాయాల్లోని గదులు వర్షానికి ఉరుస్తూ, పెచ్చులూడి క్రింద పడుతున్నాయి. ఈ విషయం ఆర్‌టిసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు రూపంలో తెలిపాము. అయినా తమ గోడు ఎవరూ పట్టించుకోవడంలేదు. వర్షానికి తమ దుకాణాల్లోని వస్తువులు తడిసి ముద్ద వుతున్నాయి. ఫలితంగా తాము ఆర్థికంగా ఎంతో నష్టపోతున్నాం. దయవుంచి మా సమస్యలను పట్టించుకోవాలి. ఇబ్బందులను పరిష్కరించాలి.

-శోభరాణి, బాధితురాలు

## రైతులు పంటల బీమా చేసుకోవాలి : జెడిఎ

రైతులకు సూచనలు ఇస్తున్న జెడిఎ చంద్రనాయక్

**ప్రజాశక్తి-రామాపురం**

రబీ సీజన్‌లో సాగు చేసే వరి, వేరుశనగ పంటలకు రైతులు డిసెంబర్ 15 లోపు పంటల బీమా చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్ రైతులకు పేర్కొన్నారు. మండలంలోని హసనాపురం , చిట్లూరు రైతు సేవ కేంద్రాల్లో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంఇ కార్యక్రమంలో భాగంగా గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రబీ సీజన్‌లో వరి, వేరుశనగ సాగు చేసే రైతులు వరి పంటకు ఎకరానికి రూ.126లు చెల్లిస్తే రూ.42వేలు, వేరుశనగ పంటకు ఎకరానికి రూ.96 ప్రీమియం చెల్లిస్తే రూ.32వేలు బీమా వస్తుందని తెలిపా రు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల భూమి కావలసిన ఎరువులు వాడకం తెలుసుకో వచ్చని అన్నారు. వరి, వేరుశనగ సాగు చేసే రైతులు కొత్తరకం వంగ డాలు సాగు చేయడంవల్ల తెగులను నివారించుకోచ్చని చెప్పారు. ఈ సమావే శంలో లక్కిరెడ్డిపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు జయరాణి, మండల వ్యవసాయ అధికారి వై.నాగమణి రైతుసేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

**రైల్వేకోడూరు:** ప్రతి రైతు తప్పనిసరిగా రైతు సేవా కేంద్రాలలో పంట నమోదు చేయాలని ఉద్యాన శాఖ అధికారి ఎం.భాస్కర్ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని నారాయణరాజుపోడు, బొజ్జవారిపల్లి గ్రామాలలో ఉద్యాన వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట సాగు చేసిన ప్రతి రైతు తప్పని సరిగా రైతు సేవకేంద్రం లో ఉన్న విఎఎ, విహెచ్‌ఎలతో ప్రతి సీజన్లో పంట నమోదు చేసుకుంటేనే రైతులకు అన్ని పథకాలు వర్తిస్తాయని తెలియ చేశారు. రబీ సీజన్ నుంచి పంటల బీమాను రైతులు ప్రభుత్వం నిర్ణయించిన ప్రీమియం చెల్లించి బీమా సదుపాయం పొందాలని కోరారు. జిల్లాలో వరి, వేరుశనగ, టమోటా, పంటలకి రబీ 2024-25 సీజన్‌లో వర్తిస్తుందని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి జి.సుధాకర్ మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వాడితే అన్ని పంటలలో అధిక దిగుబడులు పొందవచ్చునని తెలిపారు. ప్రతి పంటకు సుక్ష్మ పోషకాలు తప్పనిసరిగా అందించాలని సూచించారు. కార్యక్రమంలో విహెచ్ఎ మహేశ్వరీ, దినేష్, మార్కెటింగ్ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నార

రైల్వేకోడూరు : రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

ట్రాన్స్‌ఫార్మర్ పనులను పరిశీలిస్తున్న ఎడిఇ గోవిందరెడ్డి

## ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులు త్వరగా పూర్తి చేయండి

### - ట్రాన్స్కో ఎడిఇ గోవిందరెడ్డి

**ప్రజాశక్తి-తంబళ్లపల్లి**

తంబళ్లపల్లెలో లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి చేపట్టిన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులు త్వరగా ఏర్పాటు చేయాలని ఎడిఇ గోవిందరెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాట్ల పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాత టివి రియల్ స్టేషన్ ఎదురుగా, తూర్పు హరిజనవాడ, నల్లగుట్టలలో 63కె వి ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో 100కె వి సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేతిలో వోల్టేజ్ సమస్య లేకుండా చేయాలని ఎఇ శేషాద్రిని ఆదేశించారు. అనంతరం తంబళ్లపల్లె సబ్ స్టేషన్‌ను పరిశీలించారు. కెపాసిటర్ బ్యాంక్ పనులను పరిశీలించారు. కెపాసిటర్ బ్యాంకు పనులు పూర్తయ్యాయని త్వరలో ప్రారంభిం చేందుకు చర్యలు తీసుకుంటా మన్నారు. ఆయన వెంట లైన్మెన్ శంకర్ ఉన్నారు.

మల్లయ్యకొండను దర్శించుకున్న మద్దిరెడ్డి

## మల్లయ్య కొండను సందర్శించిన మాజీ చైర్మన్ మద్దిరెడ్డి

**ప్రజాశక్తి-తంబళ్లపల్లి**

మండల కేంద్రానికి సమీపంలోని మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయాని బుధవారం మల్లయ్య కున్న మాజీ చైర్మన్, పారిశ్రామికవేత్త కనుగండ మద్దిరెడ్డి సందర్శించారు. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునులు ఆయనకు స్వాగతం పలికి స్వామివారికి ప్రత్యేక అలంకరణతో పూజలు అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందించారు. ఆయన వెంట పలువురు అభిమానులు ఉన్నారు.

## రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్‌గా వెంకటరమణ

**ప్రజాశక్తి-వాల్మీకిపురం**

కురబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా పీలేరు నియోజకవర్గానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు వలిగట్ల వెంకట్రమణను పార్టీ అధిష్టానం నియమించింది. వాల్మీకిపురం మండలం జర్రావారిపల్లికి చెందిన రైతు కుటుంబం నుంచి వచ్చిన వలిగట్ల వెంకట్రమణ 1982 టిడిపి ఆవిర్భావం నుంచి క్రియాశీలక కార్యకర్తగా ఉంటూ ఇప్పటివరకు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ వస్తున్నారు. వలిగట్ల విధేయతను గుర్తించిన పార్టీ గతంలో ఉమ్మడి చిత్తూరు, అనంతపురం, కడప జిల్లాల్లో పార్టీ పరిశీలకుడిగా నియమించింది. 2019లో ఆంధ్రప్రదేశ్ కురబ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పని చేశారు. 1996 నుంచి 1998 వరకు వాల్మీకిపురం టిడిపి మండల అధ్యక్షుడిగా, 1995 నుంచి 2000 వరకు వాల్మీకిపురం మండల జడ్పిటిసిగా, 2001 నుంచి 2006 వరకు వాల్మీకిపురం ఎంపిపిగా పనిచేశారు. పార్టీ నుంచి ఎంతో మంది నాయకులు వివిధ పార్టీలకు మారినప్పటికీ వలిగట్ల మాత్రం పార్టీకి విధేయుడిగా ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకొని పార్టీ అధిష్టానం వలిగట్ల వెంకటరమణకు కురబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పదవిని కట్టబెట్టింది. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు, కురబ సంఘం నాయకులు, వలిగట్ల వెంకట్రమణకు అభినందనలు తెలిపారు.

మాట్లాడుతున్న జడ్జి గురు అరవింద్

## ఎక్కువ కేసులు పరిష్కరించాలి : జడ్జి

**ప్రజాశక్తి-వాల్మీకిపురం**

జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా న్యాయవాదులు కృషి చేయాలని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి గురు అరవింద్ అన్నారు. బుధవారం స్థానిక కోర్టు ఆవరణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ డిసెంబర్ 14వ తేదీ జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ లోక్ అదాలత్ కార్యక్రమంలో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యే దిశగా ముందుకెళ్లాలని న్యాయవాదులకు సూచించారు. కక్షిదారులకు అవగాహన కల్పించి, ఇరువర్గాలను రాజీ అయ్యేవిధంగా అవగాహనలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎజిపి అశోక్‌కుమార్‌రెడ్డి, న్యాయవాదులు విభాకర్ రెడ్డి, రమణ, వెంకటరమ ణారెడ్డి, చంద్ర, కక్షిదారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## రక్తదానం చేద్దాం..ప్రాణాలు కాపాడుదాం

**ప్రజాశక్తి-వాల్మీకిపురం**

ప్రతి ఒక్కరు రక్తదానం చేయడం వలన ఆపద సమయాల్లో ఉన్న వారి ప్రాణాలను కాపాడిన వారు అవుతామని సామాజిక సేవకురాలు సాగుబడి లావణ్యరెడ్డి అన్నారు. బుధవారం వెల్విషర్స్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో స్థానిక గంగమ్మ గుడి వీధిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో యువత పాల్గొని రక్త దానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో బుధవారం పుట్టినరోజు జరుపుకున్న వారందరికీ మంచి జరగాలన్న ఉద్దేశంతో రక్తదాన శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ఏ ప్రాంతంలోనైనా ఫ్రెండ్స్ టూ సపోర్ట్ వెబ్సైట్ లేదా మొబైల్ యాప్‌లను సందర్శించి, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారు రక్తాన్ని పొందవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భార్గవ్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, సాగుబడి ఆనంద రెడ్డి, కార్తికేయ రెడ్డి, సాధిక్ పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న యువత

మాట్లాడుతున్న తహశీల్దార్ రామాంజనేయులు

## భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభ

**ప్రజాశక్తి-రామాపురం**

గ్రామంలో ఇటీవల జరిగిన రీ సర్వేతో ఏర్పడ్డ భూ సమస్యల పరిష్కా రానికి గ్రామ సభ ఏర్పాటు చేయడం జరిగిందని తహశీల్దార్ రామాంజనేయులు అన్నారు. మండలంలోని హసనాపురం గ్రామంలో రీ సర్వేలో ఏర్పడ్డ భూ సమస్యల పరిష్కారానికి బుధవారం గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హసనాపురం గ్రామంలో ఇటీవలి కాలంలో ఎకరాలు ఈ సర్వే 7749-17 ఎకరాలలో చేయడం జరిగిందని అన్నారు. ఈ రీసర్వే వల్ల గ్రామ ప్రజలకు ఎలాంటి భూ సమస్యలున్నా గ్రామ సభ దృష్టికి తీసుకురా వాలని సమస్య పరిష్కరించడానికి రెవెన్యూ అధికారులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో డిఐఎస్ గురువురెడ్డి, ఐఎఫ్ ప్రసాద్. మండల సర్వేయార్ మధురమోహన్‌రెడ్డి, ఆర్ఐ సమ్మద్ ఖాన్. విఆర్ఒ రమణ, స్థానిక నాయకులు, రైతులు ప్రజలు పాల్గొన్నారు.

## తహశీల్దార్ పనితీరుపై కలెక్టర్ హర్షం

**ప్రజాశక్తి-పుల్లంపేట**

మండల కేంద్రంలోని మంగళవారంజిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ప్రజా పరిషత్ సభ భవనంలో నిర్వహించిన మండల స్థాయి అధికారుల సమీక్ష సమావేశంలో తహశీల్దార్ అరవింద్ కిషోర్ పని తీరుపట్ల హర్షం వ్యక్తం చేశారు. పిజిఆర్ఎస్, భూ సమస్యలు, విద్యార్థుల సర్టిఫికెట్ల జారీ, ప్రజా సమస్యను పరిష్కరించే తీరు పట్ల కలెక్టర్ తాసిల్దార్ పై ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఏవైనా సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించడానికి ముందుంటానని అధికారులకు తెలిపారు.

## రాయుడు ఆశయ సాధన కోసం కృషి చేద్దాం

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

కార్మిక నాయకుడు యం.ఎస్ రాయుడు మృతి కార్మిక, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని ఎమ్మెస్ రాయుడు సంస్మరణ సభలో వక్తలు పేర్కొన్నారు. బుధవారం కళాంజలి కల్యాణ మంటపంల సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఎం.శివరామకృష్ణదేవరా అధ్యక్షతన యం.ఎస్ రాయుడు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆకేపాటి అమర్ నాథ్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్ నరసింహులు మాట్లాడుతూ రాజంపేట ప్రాంతంలో లారీ డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్, ఆటో వర్కర్స్ యూనియన్‌లు ఏర్పాటు చేసి వారి సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేపట్టారని అన్నారు. రాజంపేట లో ఉన్న కమ్యూనిస్టు నాయకులు ఎంసీ ఆంజనేయులు, కమ్ము సాహెబ్ పరిచయంతో సిపిఐ లో చేరి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కార్మిక, ప్రజా సమస్యలపై అనేక ప్రజా, కార్మిక పోరాటాలకు నాయకత్వం వహించారని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు చిట్వేలి రవికుమార్, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లెల శ్రీవాణి, తెలుగుదేశం రాష్ట్ర నాయకులు కుమార్, రిటైర్డ్ తహసిల్దార్ రమణ, జనసేన నాయకులు నాసిర్ ఖాన్, కాకతీయ విద్యా సంస్థల అధినేత పోలా రమణారెడ్డి, వైసిపి పట్టణ అధ్యక్షులు కృష్ణారావు పాల్గొన్నారు.

భోజనాన్ని వడ్డిస్తున్న దాతలు

## అన్నదానం గొప్పది

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

అన్నదానం గొప్పదని యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ సభ్యులు తగాది రాజశేఖర్ పేర్కొన్నారు. స్థానిక పట్టణంలో నివాసమున్న రమేష్‌బాబు, శారదల కుమార్తె పద్మావతి 8వ పుట్టినరోజుని పురస్కరించుకొని యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగుళూరు మహాదేవపుర శబరి ఆశ్రమంలోని 70 మంది వృద్ధులు, చిన్నారులకు అన్నదానం చేసినట్లు చెప్పారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ యంగ్ ఇండియా ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. మున్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుడుతామని అన్నారు. అన్నదానానికి సహకరించిన చిన్నారి శారద వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. **వీరబల్లి :** కార్తీక మాసంలో అన్నదానం మహా పుణ్య కార్యక్రమం అని ఎస్ఐ మోహన్ నాయక్ తెలిపారు. బుధవారం హెడ్ కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం ఏర్పాటు చేసిన వన భోజనాల కార్యక్రమ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక మాసంలో బంధువులు, స్నేహితులుతో కలసి చెట్ల నీడలో కలసి భోజనం చేస్తే మంచిది అన్నారు. కార్తీక మాసం వచ్చింది అంటే ప్రతి ఇంట్లో ఒక ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుందన్నారు. ఇలాగే పేద ప్రజలకు అన్నదాన కార్యక్రమాలు చేస్తే చాలా మంచిది అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారి చేత యోగ గురువులు సతీష్, జంగమయ్య, నటరాజ్ మెడిటేషన్ గురుంచి వివరించారు. అనంతరం ఎస్ఐ మోహన్ నాయక్ ను శాలువా జ్ఞాపిక తో సత్కరించారు. కార్యక్రమంలో విఆర్డిఎస్ సురేంద్రారెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు, ఎఎస్ఐ వెంకటేశ్వర్లు,రాజశేఖర్, రాజేంద్ర, శేఖర్ భక్తులుపాల్గొన్నారు.

## విద్యార్థి దశలో కష్టపడడం అలవర్చుకోవాలి

**ప్రజాశక్తి - చాపాడు :** విద్యార్థి దశలో కష్టపడడం అలవర్చుకోవాలని జమ్మలమడుగు ఆర్‌డిఒ సాయి శ్రీ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని లక్ష్మీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ముందస్తు బాలల దినోత్సవం కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో అందరికంటే చురుకుగా ఉంటేనే రాణించే అవకాశం ఉంటుం దన్నారు. అనంతరం వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానో పాధ్యా యులు సూర్యనారాయణ, తహశీల్దార్ రమాకుమారి, ఎంఇఒ రవిశంకర్, వంశీకృష్ణ, ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యామసుందర్‌రెడ్డి, విశ్రాంత తెలుగు పండిట్ సాంబశివారెడ్డి, పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

# క్రైం కార్నర్

## ఆటో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్ బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్యా యత్నంకు పాల్పడినట్లు మదనపల్లె రెండవ పట్టణ సిఐ రామచంద్ర తెలిపారు. స్థానిక కమ్మగడ్డవీధిలో నివాసమున్న ఉంటున్న నౌషాద్‌అలీ ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడని తెలిపారు. తన తల్లికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో తిరుపతిలో ఆపరేషన్ చేయించి, రాత్రి డిశ్చార్జిపై ఇంటికి తీసుకు వచ్చారని చెప్పారు. ఇంట్లో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ పోషణ కష్టంగా మారడంతో పాటు, అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడని అన్నారు. అర్ధరాత్రి అందరూ నిద్రపోయాక ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడని చెప్పారు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితున్ని వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. ఈఘటనపై కేసు దర్యాప్తులో ఉన్నట్లు సిఐ తెలిపారు.